ప్రజాశక్తి
శనివారం 20 జనవరి 2024 5
శ్రీకాకుళం



25న సిఎం సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నరసన్నపేట

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్ర నుంచే ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తున్నందున ఈనెల 25న భీమిలిలో నిర్వహించే భారీ బహిరంగ సభ జయప్రదానికి పార్టీ శ్రేణులు ఇప్పట్నుంచే పనిచేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సభ విజయవంతానికి సన్నాహక సమావేశాలను మండల, నియోజకవర్గాల స్థాయిల్లో 21, 22, 23 తేదీల్లో నిర్వహించాలని తెలిపారు. నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశాలను ఆయా ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పార్టీ బాధ్యులంతా హాజరై కార్యక్రమం విజయవంతానికి సూచనలు చేయాలని కోరారు. ప్రతిపక్ష పార్టీలు ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని, వచ్చే ఎన్నికల్లో వాటికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు.

- ఇప్పటివరకు 3.60 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు
- కొనాల్సింది 5.40 లక్షల టన్నులు

ఎదురుచూపులే...

- ధాన్యం కొనుగోలులో వెంటాడుతున్న సాంకేతిక సమస్యలు

'జిల్లాలో చివరి గింజ వరకు ధాన్యం కొంటాం. దళారుల ప్రమేయం లేకుండా చేస్తాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.' ఇవీ ప్రజాప్రతినిధులు, అధికారులు ధాన్యం కొనుగోలు ప్రారంభంలో చెప్పే మాటలు. కొనుగోలు విషయానికి వచ్చేసరికి మాత్రం ఆ వేగం కనిపించడం లేదు. ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా అధికారులు క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారే తప్ప పని కావడం లేదు. జనవరి మూడో వారంలోకి ప్రవేశించినా ధాన్యం కొనుగోలుకు ఎదురుచూపులే మిగిలాయి. జిల్లాలో నేటికీ పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు తెరుచుకోలేదు. ధాన్యం సిద్ధంగా ఉన్నా కొనుగోలు చేయకపోవడంతో, రైతులు దళారులకు అమ్ముకుంటున్నారు. సాంకేతిక సమస్యలు, ధాన్యం నాణ్యంగా లేకపోవడంతో మిల్లర్లు తీసుకునేందుకు నిరాకరించడం వంటి సమస్యలతో ధాన్యం కొనుగోలు ముందుకు సాగడం లేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్‌లో 3,51,843 ఎకరాల్లో వరి వేశారు. ఇందులో 3,50,765 ఎకరాలకు పంటల క్రాపింగ్ చేశారు. 3,34,330 ఎకరాలకు ఇకెవైసి పూర్తయింది. 8.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో 7,87,447 మెట్రిక్ టన్నులు మార్కెట్‌లోకి వస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుగుణంగా ఏర్పాట్లు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది వరికి సాధారణ రకానికి రూ.2,183, గ్రేడ్ 'ఎ' రకానికి రూ.2,203 మద్దతు ధర ప్రకటించింది. ధాన్యం కొనుగోలుకు అధికారులు జిల్లావ్యాప్తంగా 606 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలను మూడు కేటగిరీలుగా విభజించారు. రెండు వేలు పైబడి ధాన్యం సేకరించే అవకాశమున్న కేంద్రాలను ఎ-కేటగిరీగా, వెయ్యి నుంచి రెండు వేల టన్నుల్లోపు కొనుగోలు చేసే వాటిని బి-కేటగిరీగా విభజించారు. వెయ్యి టన్నుల కంటే తక్కువ ధాన్యం కొనుగోలుకు అవకాశమున్న వాటిని సి-కేటగిరీగా నిర్ణయించారు.



బూర్జ మండలం అన్నంపేట వద్ద ధాన్యాన్ని లోడింగ్ చేస్తున్న రైతులు

3.60 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు

ధాన్యం కొనుగోలుకు అన్నిరకాల ఏర్పాట్లు చేశామని అధికారులు చెప్తున్నా, క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కనిపించడం లేదు. కొనుగోలు కోసం 606 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ఇప్పటివరకు 576 కేంద్రాలు తెరుచుకున్నాయి. వీటి ద్వారా 3.60 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఇందులో గ్రేడ్-ఎ రకం 233 మెట్రిక్ టన్నులు కాగా, సాధారణ రకం ధాన్యం 3.60 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేశారు. బ్యాంకు గ్యారంటీలు, సాంకేతిక సమస్యలు వంటి సమస్యలతో ధాన్యం కొనుగోలు సాఫీగా సాగడం లేదు. పండగ వెళ్లినా నేటికీ వేలాది మంది రైతుల వద్ద ధాన్యం ఉండిపోయింది. ప్రభుత్వ అంచనా ప్రకారం ఇంకా సుమారు రెండు లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేయాల్సి ఉంది.

మండలాల్లో కొనుగోలు పరిస్థితి ఇలా...

జిల్లాలో గ్రేడ్-ఎ, సాధారణ రకం ధాన్యం కలిపి మొత్తం 3.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. కంచిలి, కవిటిలో ఇప్పటివరకు కనీసం వెయ్యి టన్నులనూ కొనుగోలు చేయలేదు. కంచిలిలో అత్యల్పంగా కేవలం 448 మెట్రిక్ మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. కవిటిలో 677 మెట్రిక్ టన్నులు, పొందూరులో 2137 మెట్రిక్ టన్నులు, ఎచ్చెర్లలో 2,663 మెట్రిక్ టన్నులను కొన్నారు. ఇచ్ఛాపురంలో 2,736 మెట్రిక్ టన్నులు, వజ్రపుకొత్తూరులో 3,310 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాలో అత్యధికంగా జలుమూరులో 30,077 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఆ తర్వాత స్థానంలో నరసన్నపేట ఉంది. నరసన్నపేటలో 24,473 మెట్రిక్ టన్నులు కొన్నారు. సారవకోటలో 22,991 మెట్రిక్ టన్నులు, కోటబొమ్మాళిలో 19,782 మెట్రిక్ టన్నులు, నందిగాంలో 19,733 మెట్రిక్ టన్నులు, కొత్తూరులో 19,110 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలుకు లక్ష్యం పెట్టుకోలేదంటూ అధికారులు చెప్తున్నా, కేంద్రాలకు నిర్దేశించిన మేరకే కొంటున్నారు. మిల్లులకు ఇచ్చిన ధాన్యం మేరకు మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలు తీసుకుంటున్నారు. బ్యాంకు గ్యారంటీలు పూర్తి కావడంతో ఆర్‌బికె సిబ్బంది తర్వాత వచ్చిన వాటిని వెనక్కి పంపిస్తున్నారు.

సాంకేతిక సమస్యలతో రైతుల ఇబ్బందులు

ధాన్యం తరలింపులో తలెత్తిన సాంకేతిక సమస్యలతో రైతులకు ఇబ్బందులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ఏడాదీ రైతులకు వ్యయ ప్రయాసలు తప్పడం లేదు. అమ్మిన ధాన్యాన్ని రైతులు 40 నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న మిల్లులకు తరలించడంలో నానాపాట్లు పడుతున్నారు. ఆన్‌లైన్ ఇబ్బందులు, అన్‌లోడింగ్ సమస్యలతో రైతులు దళారుల వైపే మొగ్గు చూపుతున్నారు. రాజకీయ పలుకుబడి, పైరవీలు చేసే మిల్లర్లే అధిక పరిమాణంలో ధాన్యం తీసుకుంటున్నారని గుర్తించిన ప్రభుత్వం, ఈసారి అందరికీ ఆన్‌లైన్ ద్వారా ధాన్యం కేటాయించాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయం చిన్న మిల్లర్లకు నష్టం మాట పక్కన పెడితే ఇప్పుడు రైతులకు తీవ్ర ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. చిన్న మిల్లుల సామర్థ్యం తక్కువగా ఉండడంతో పాటు తగినంత స్థలం లేకపోవడంతో అన్‌లోడింగ్‌కు రెండు, మూడు రోజుల పాటు మిల్లుల వద్దే ధాన్యం బస్తాలను తీసుకెళ్లిన ట్రాక్టర్లు ఉండిపోతున్నాయి.



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నవీన్

ధాన్యం కొనుగోలు వేగవంతం

- ప్రతి గింజా కొంటాం
- ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. రైతుకు పూర్తి భరోసా కల్పించేలా, ఒక్కరూ నష్టపోకుండా పకడ్బందీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా రూపొందించిందని తెలిపారు. రైతు ఎంతో కష్టపడి పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధరను ఇవ్వడం మన బాధ్యతని, ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 79,177 రైతుల నుంచి 3.60 లక్షల టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. 70,174 మంది రైతులకు రూ.608.38 కోట్ల చెల్లింపులు చేసినట్లు చెప్పారు. మిగిలిన రైతులకు చెల్లించాల్సిన రూ.177.51 కోట్లను నాలుగైదు రోజుల్లో చెల్లించనున్నామన్నారు. సమావేశంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ శిమ్మ నేతాజీ, గొండు రఘురాం, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖల జెడిలు కె.శ్రీధర్, కిషోర్, మత్స్య శాఖ ఎడి శ్రీనివాసరావు, వంశధార ప్రాజెక్టు ఎస్ఇ డోల తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కుల గణనకు సహకరించాలి

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కుల గణనకు ప్రజలందరూ సహకరించాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. నగరంలోని పెద్దపాడులో కుల గణన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక ఆర్థిక పరిస్థితులు, కులాల వారీగా ఎంతెంత శాతం ఉన్నారన్న వివరాలు కుల గణన ద్వారా తెలుస్తాయన్నారు. ప్రభుత్వాలు ఆయా కులాల ప్రజలకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను కులాల సహాయ సామాజిక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలో నిర్ణయాలు తీసుకోవడానికి, ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల అమలు కోసం జనాభా ప్రాతిపదికన అవసరమైన బడ్జెట్ కేటాయింపునకు ఈ గణన ఉపయోగపడుతుందన్నారు. పది రోజులు పాటు చేపట్టే ఈ గణనలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు కుటుంబ వివరాలను సేకరించడానికి ఇంటింటికీ వస్తారని తెలిపారు.



కుల గణనను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

పెండింగ్ ఆర్థిక బకాయిలు చెల్లించాలి

యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

పిఎఫ్, ఎపిజిఎల్ఐ, పిఆర్‌సి, ఇఎల్, డిఎల పెండింగ్ బకాయిలు రూ.18 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని, 30 శాతం ఐఆర్‌తో పాటు కొత్త పిఆర్‌సి విధి విధానాలను రూపొందించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి వద్ద చెవిలో క్యాబేజీ పువ్వులు పెట్టుకుని మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా ఉద్యోగులు, ఉపాధ్యాయుల హామీల్లో ఏ ఒక్కటీ పరిష్కరించలేదని విమర్శించారు. మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజాస్వామ్యయుతంగా పోరాటం చేస్తుంటే ఉపాధ్యాయులపై ప్రభుత్వం నిర్బంధం విధిస్తోందని, అక్రమంగా కేసులు పెడుతూ భయాందోళనలకు గురిచేస్తోందన్నారు. ఇటువంటి చర్యలు సరికాదన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి హెచ్.అన్నాజీరావు, పి.సూర్యప్రకాశరావు, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సోంపేటలో నిరసన ప్రదర్శన చేపట్టారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. బకాయిలను విడుదల చేయకుంటే ఈనెల 24న జిల్లాస్థాయిలో నిరసన ప్రదర్శనలు, 31 నుంచి ఫిబ్రవరి మూడో తేదీ వరకు శ్రీకాకుళంలోరిలే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జి.రమేష్, మురళి, దొరబాబు, జగదీష్ బాడిత్య తదితరులు పాల్గొన్నారు. ఆమదాలవలసలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు టి.వి.టి భాస్కరరావు, జి.శ్రీరామచంద్రమూర్తి, పి.మురళీధర్ తదితరుఉలు పాల్గొన్నారు. పలాసలో కాశీబుగ్గ పాతబస్టాండ్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ బి.చిట్టిబాబు, జి.కోదండరావు, ఎల్.వి చలం, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు. నరసన్నపేటలో చెవిలో పువ్వులు పెట్టుకుని, ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.దమయంతి తదితరులు పాల్గొన్నారు. టెక్కలిలో నల్లబ్యాడ్జీలు ధరించి ఇందిరాగాంధీ జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కె.దాలయ్య, టి.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు. కోటబొమ్మాళిలో ఎంఇఒ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు వై.వాసుదేవరావు, జి.నారాయణరావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. పొందూరులోని అంబేద్కర్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొందూరు అప్పారావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ గౌరీశ్వరరావు, జి.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం : చెవిలో క్యాబేజీ పువ్వులతో మోకాళ్లపై నిల్చొని నిరసన



నరసన్నపేట : చెవిలో పువ్వులతో ఒంటి కాలిపై నిల్చొని నిరసన




పొందూరు : కొవ్వొత్తుల ప్రదర్శన చేపడుతున్న ఉపాధ్యాయులు

దళిత ద్రోహి జగన్

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

దళితుల ద్రోహి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని, ఆయన నేడు అంబేద్కర్ జపం చేయడం విడ్డూరంగా ఉందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ పాలనలో దళితుల మారణకాండ నేటికీ కొనసాగుతోందన్నారు. దళిత, గిరిజన ఓట్లతో గద్దెనెక్కిన వైసిపి... ఎస్‌సి కార్పొరేషన్ నిధులను దారిమళ్లించి వారికి తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. కోడి కత్తి శ్రీనును ఎన్నికలకు ముందు పావుగా వాడుకుని ఐదేళ్లుగా జైల్లో మగ్గుతున్నా కనీసం పట్టించుకున్న పాపానపోలేదన్నారు. మాస్కులు అడిగిన డాక్టర్ సుధాకర్‌ను అతి కిరాతకంగా నడిరోడ్డుపై హింసించిన సంఘటనను రాష్ట్రంలో ఎవరూ మర్చిపోలేదన్నారు. రాష్ట్రంలోని దళిత కుటుంబాలు వైసిపి ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉండడంతో కొత్త నాటకానికి జగన్మోహన్ రెడ్డి తెరతీశారని విమర్శించారు. జగన్ ఎత్తుగడలను దళితులు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు అన్నెపు భాస్కరరావు, బి.వి రమణమూర్తి, ధవళ అప్పలనాయుడు పాల్గొన్నారు.





సామాజిక సంఘ సంస్కర్త వేమన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సామాజిక సంఘ సంస్కర్త, తెలుగు సమాజానికి తన పద్యాల ద్వారా వెలుగులు నింపింది వేమన అని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. వేమన జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలని నిర్ణయించిందని తెలిపారు. తేట తెలుగు పదాలతో సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తన కవిత్వంతో సమాజాన్ని జాగృతం చేసిన కవి యోగి వేమన అన్నారు. తెలుగు భాషలో, భావంలో ప్రజలకు సాహిత్యాన్ని చేరువ చేసిన ఘనత వేమనదేనన్నారు. సమాజంలో అసమానతలను రూపుమాపడానికి 600 సంవత్సరాలకు ముందే తన కవితల ద్వారా ప్రజలను మేల్కొలిపిన సంఘ సంస్కర్త వేమన అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, బిసి సంక్షేమాధికారి బి.అనురాధ, కలెక్టరేట్ ఎఒ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్లు ఎం.శ్రీకాంత్, ప్రకాష్, బిసి వెల్ఫేర్ వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీల సత్యాగ్రహం

అంబేద్కర్ విగ్రహాలకు వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం


విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగానైనా ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ జిల్లాలో అంబేద్కర్ విగ్రహాల వద్ద అంగన్వాడీలు శుక్రవారం సత్యాగ్రహం చేపట్టారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించిన అనంతరం వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా మహిళలు 39 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగానైనా అంగన్వాడీలకు సామాజిక న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని జ్యోతిరావుపూలే పార్కులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్వాడీలు సత్యాగ్రహం చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం పోరాడిన బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం ఆవిష్కరించడాన్ని హర్షిస్తున్నామన్నారు. ఏ సామాజిక న్యాయం కోసం ఆయన పోరాడారో అదే న్యాయం కోసం అంగన్వాడీలు నేడు పోరాడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వారి ప్రధానమైన జీతాల పెంపు కోర్కెలను తిరస్కరిస్తూ వచ్చిందని, లక్ష మందికి పైగా ఉన్న మహిళలకు న్యాయం చేయకుండా సామాజిక న్యాయం చేస్తామనడంలో అర్థం లేదన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.పార్వతి, డి.జ్యోతి, నీలవేణి, అప్పలనరసమ్మ తదితరులు పాల్గొన్నారు. ఎచ్చెర్లలో అంబేద్కర్ విగ్రహం వద్ద సత్యాగ్రహం చేపట్టారు. ముందుగా ప్రదర్శన నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు వై.విజయలక్ష్మి, యు.శారద, కె.ధనలక్ష్మి, ఎం.రాధిక తదితరులు పాల్గొన్నారు. ఆమదాలవలసలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని ఐలు రాష్ట్ర కమిటీ సభ్యులు బొడ్డేపల్లి మోహనరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు పంచాది లతాదేవి, మాధవి, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. బూర్జలో ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు జ్యోతి, రాధిక, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. కొత్తూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద సత్యాగ్రహం చేపట్టారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు హేమలత, ధనలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు. టెక్కలిలో అంబేద్కర్ విగ్రహం వద్ద సత్యాగ్రహం చేపట్టి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు, బి.వాసు, పి.సాంబమూర్తి, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, బి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. పొందూరులో తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె 39వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలో ఎనిమిది సెంటర్లు తెరిచారని దుష్ప్రచారం నేపథ్యంలో ఆయా కేంద్రాలను పరిశీలించడానికి వెళ్లగా అవి తాళాలు వేసి ఉన్నాయి. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జ్యోతిలక్ష్మి, అనురాధ, రమణమ్మ పాల్గొన్నారు. కోటబొమ్మాళిలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద దీక్ష చేపట్టారు. ఎన్‌జిఒ సంఘ నాయకులు డి.వి రమణ, కూన వలసయ్య సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు డి.సుధ తదితరులు పాల్గొన్నారు. పలాసలో అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.మంజు, ఎల్.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురంలో బస్టాండ్ కూడలి వద్ద రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, యూనియన్ నాయకులు హైమ, బాలామణి తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల : అంబేద్కర్ విగ్రహం వద్ద సత్యాగ్రహం చేపడుతున్న అంగన్వాడీలు



ఇచ్ఛాపురం : రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అశోక్

టిడిపి విజయాన్ని ఆపలేరు

ప్రజాశక్తి- కవిటి

రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయాన్ని ఎవరూ ఆపలేరని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలం నెలవంక పంచాయతీ కొరికానపుట్టుగ, దుర్గమ్మపుట్టుగ గ్రామాల నుంచి వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పిన ఎమ్మెల్యే అశోక్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చంద్రబాబు నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో టిడిపి పూర్తిస్థాయి మెజార్టీతో పట్టం కడతారని జోస్యం చెప్పారు. వైసిపి ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ఇప్పటికే ప్రజలు విసిగిపోయారాని, ఏ ఒక్కవర్గం సంతృప్తికరంగా లేదన్నారు. అవుట్‌సోర్సింగ్ నుంచి అంగన్వాడీల వరకు మున్సిపల్ కార్మికుల నుంచి వాలంటీర్ల వరకు సమ్మె చేసేందుకు పూనుకోవడం ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్, హరికృష్ణ బిసాయి, దొండపాటి నారాయణ, తట్ట హేమదాస్, బాలరాజు పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నవీన్

పట్టుదలతో చదివితే ఉన్నత స్థానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ మల్లారపు నవీన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బిసి స్టడీసర్కిల్ ద్వారా ఉచిత శిక్షణకు ఎంపికైన 100 మంది బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు గ్రూప్-2 ప్రిలిమ్స్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు, బిసి సంక్షేమ శాఖాధికారిణి అనురాధ పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి- టెక్కలి

పనిచేసే ప్రదేశంలో స్త్రీల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడితే చట్టరీత్యా కఠినమైన శిక్షలు తప్పవని, స్త్రీలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఇన్‌ఛార్జి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందితో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ వివక్షను రూపుమాపాలని, లింగ వివక్ష చట్టరీత్యా నేరమని, లింగ సమానత్వం అనేది ప్రాథమిక హక్కు అన్నారు. ఈ సదస్సులో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు డి.వివేకానంద, ఎంపిడిఒ లక్ష్మీబాయి, తహశీల్దార్ ప్రవల్లిక ప్రియ, ఎఎస్ఐ కేశవరావు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్


ఉమామహేశ్వరరావు

ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఇసిఇ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న సనపల ఉమామహేశ్వరరావుకు కాకినాడ జెఎన్‌టియు యూనివర్శిటీ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్‌లో పిహెచ్‌డి డిగ్రీని మంజూరు చేసిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటలో తెలిపారు. ఆప్టిమల్ కోపరేటివ్ స్పెక్ట్రమ్ సెన్సింగ్ ఫర్ ఇంప్రూమెంట్ ఆఫ్ స్పెక్టల్ అండ్ ఎనర్జీ ఎఫిసియన్సీ ఆఫ్ అండర్ వాటర్ ఛానల్ కమ్యూనికేషన్ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ పట్టాను జారీ చేసిందన్నారు. ఉమా మహేశ్వరరావును ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆరెడ్డి డీన్ డాక్టర్ డి.ఆజాద్, డాక్టర్ బి.రామారావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

జన సంక్షేమమే సిఎం ధ్యేయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

జన సంక్షేమమే సిఎం జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. శుక్రవారం మండలంలో తొగరాం గ్రామ సచివాలయ పరిధి కొత్తవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాల లబ్దిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయాల కోఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, నాయకులు మెట్ట ఆనంద్, కూటికుప్పల సన్యాసిరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

విద్యార్థులకు అరుదైన అవకాశం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్టూడెంట్ సెంట్రిక్ నేషనల్ వెబినార్ పేపర్ ప్రజెంటేషన్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అరుదైన అవకాశం దక్కింది. డిగ్రీ సెకండ్ ఇయర్ బిజెడ్సి చదువుతున్న మామిడి కృష్ణ చైతన్య ప్రథమస్థానాన్ని దక్కించుకున్నారు. అద్దంకి కెఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహించిన స్టూడెంట్స్ సెంట్రిక్ నేషనల్ వెబినార్‌లో పేపర్ ప్రజెంటేషన్ విభాగంలో జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి దక్కించుకున్న ఆయన రూ.3వేల నగదుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అలాగే మొదటి పదిస్థానాల్లో పి.నితిన్‌కుమార్, ఎస్.జయశ్రీ చోటు దక్కించుకున్నారు. ఈసందర్భంగా శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ విద్యార్థులను ప్రశంసించారు. విద్యార్థుల మెంటార్ డాక్టర్ ఆర్.ప్రమీల, బోటనీ విభాగాధిపతి రవీంద్ర హాజరయ్యారు.

ఒక శాతం సెస్ వసూలు తప్పనిసరి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర, రాష్ట్ర విభాగాలు, సంస్థలు కాంట్రాక్టర్ల ద్వారా నిర్మాణ పనులను నిర్వహించే అధికారులు, కాంట్రాక్టర్లకు చెల్లించే బిల్లులు నుంచి ఒకశాతం సెస్‌ను వసూలు చేసి ప్రతినెలా నిర్మాణ మండలికి ఆ మొత్తాన్ని బదిలీ చేయాలని ఉపకార్మిక కమిషనర్ ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ చట్టం 1996 కింద ఒకశాతం సెస్ వసూలు తప్పనిసరన్నారు. కాంట్రాక్టర్ల ద్వారా చేపట్టే ప్రైవేట్ నిర్మాణాల మీద సెస్‌ను ప్లాన్ అప్రూవల్ అధారిటీలైన మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు ప్లాన్ అప్రూవల్ సమయంలో వసూలు చేసి ఎపి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు జమచేయాలన్నారు. అలా జమ చేసిన మొత్తాలకు సంభందించిన వార్షిక నివేదికలను కార్మికశాఖకు నెలవారీ పంపాలని కోరారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి


పలాస: అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

సిఎం జగన్మోహన్ రెడ్డి అంబేద్కర్ ఆశయాలను కొనసాగించేందుకే విగ్రహం ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. విజయవాడలో 125 అడుగుల విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభంలో భాగంగా కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి ఆయన మాట్లాడుతూ నిలువెత్తు కాంస్య విగ్రహం ఏర్పాటు చేసి సిఎం జగన్మోహన్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభం చేసుకోవడం దేశ చరిత్రలో అపురూప ఘట్టమన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు హనుమంతు వెంకటరావు, మున్సిపల్ చైర్మన్ బల్లా గిరిబాబు, వైస్ చైర్మన్లు మీసాల సురేష్ బాబు, బోర బుజ్జి, పట్టణ అధ్యక్షులు సనపల సింహాచలం పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: అంబేద్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం, బెల్లుపడ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. విజయవాడలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరిస్తున్న నేపథ్యంలో శుక్రవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ పురుషోత్తం రెడ్డి, కె.మోహనరావు, దక్కత నూకయ్య రెడ్డి, ఉప్పాడ రాజారెడ్డి పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: భారతరత్న బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణను పురస్కరించుకుని నగరంలో శుక్రవారం మారథాన్ నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం



శ్రీకాకుళం అర్బన్ : నగరంలో నిర్వహిస్తున్న మారథాన్

వద్ద ఈ కార్యక్రమాన్ని డిఇఒ కె.వెంకటేశ్వరరావు జెండాఊపి ప్రారంభించారు. పొట్టి శ్రీరాములు కూడలి మీదుగా కలెక్టరేట్ వరకు మారథాన్ కొనసాగింది. సామాజిక సమతా సంకల్పంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వేశ్వర రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి బాలమాన్ సింగ్, సెట్ శ్రీ సిఇఒ బి.ప్రసాదరావు, డిఎస్‌డిఒ శ్రీధర్, చింతాడ రామ్మోహన్, పలు క్రీడా సంఘాలు పాల్గొన్నారు.

కులగణన పక్కాగా చేపట్టాలి


కవిటి : సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన పక్కాగా చేపట్టాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలం కొత్తపుట్టుగలో జరిగిన కులగణనలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉంటూ సర్వే చేపట్టాలని సూచించారు. ప్రతి ఇంటిని, ప్రతివ్యక్తిని సందర్శించి కులగణన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మన్మధరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస: ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వేను పక్కాగా చేపట్టాలని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి విఎస్‌-లక్ష్మీ ప్రసన్న సూచించారు. శుక్రవారం స్థానికంగా జరుగుతున్న కులగణన సర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక వ్యక్తి సమాచారం ధ్రువీకరణ చేసేటప్పుడు ఎటువంటి సమస్యలు వస్తున్నాయి, ఎంత సమయం పడుతుందని అడిగి తెలుసుకున్నారు. పరిశీలనలో కమిషనర్ ఎం.రవిసుధాకర్, జిల్లా ఉప గణాంకాధికారి టి.అప్పారావు, స్థానిక సహాయ గణాంకాధికారి బి.గోవిందరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలో శుక్రవారం జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ ఈదుపురం గ్రామంలో కులగణన ప్రారంభించారు. ఎంపిడిఒ ఈశ్వరరావు అధ్వర్యంలో మండలంలో పదిరోజుల పాటు కులగణన చేయడం జరుగుతుందని ఎంపిడిఒ తెలిపారు. పది రోజులుగా చేసినప్పటికీ వివిధ కారణాల వలన కులగణన జరగని గ్రామాల్లో మరో ఐదు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్తు వరప్రసాద్, వివేకానంద రెడ్డి, సుగ్గు ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలో జరుగుతున్న కులగణన సర్వేను


ఆమదాలవలస : కుల గణన సర్వేను పరిశీలిస్తున్న లక్ష్మీ ప్రసన్న


ఇచ్ఛాపురం : కులగణన ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి నారాయణమ్మ

డిఎల్‌డిఒ అలివేలు మంగమ్మ పరిశీలించారు. పెద్ద పద్మాపురం, కోసమాలల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే పక్కగా జరగాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రకుమారి, ఎంఇఒ దేవేంద్రరావు, ఎంపిటిసి ప్రతినిధి ఉర్లన రుషి, తేజారావు, శ్రీనివాసరావు, కార్యదర్శి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వైద్యం ప్రభుత్వ బాధ్యత


కోటబొమ్మాళి : వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపిపి ఉమామల్లేశ్వరరావు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నిర్వహించిన శిబిరాలు రోగుల వ్యాధి నయమయ్యే వరకు పూర్తిస్థాయిలో చేయూత నివ్వడమే ప్రభుత్వ ఉద్దేశమని ఎంపిపి రోణంకి ఉమా మల్లేశ్వరావు అన్నారు. శుక్రవారం మండలంలో గంగరాం సచివాలయంలో జరిగిన జగనన్న ఆరోగ్యసురక్ష-2 కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్ళి పేషెంట్లును శిబిరానికి తీసుకురావడం, పరీక్షలు నిర్వహించటం, మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పేడాడ జోత్న, పేడాడ వెంకటరావు, ఆస్పత్రి సూపరింటిండెంట్ పొన్నాడ గణేష్, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 206 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వజ్రపుకొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కనిష్క తెలిపారు. శుక్రవారం చినవంక ప్రాథమిక పాఠశాల అవరణలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బిపి, ఇసిజి, కిడ్నీ సంబంధిత పరీక్షలు నిర్వహించారు. ముగ్గురు రోగులను రిఫర్ చేసినట్టు వైద్యాధికారి తెలిపారు. వైద్య శిబిరాన్ని ఎంపిడిఒ సిహెచ్ ఈశ్వరమ్మ, ఇఒపిఆర్‌డి తిరుమలరావు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు విజయకుమార్ రెడ్డి, తేజస్విత, వైద్య సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


సోంపేట : ఆరోగ్య సురక్ష కిట్‌ను అందజేస్తున్న ఎంపిపి

సోంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి డాక్టర్ దాసు కోరారు. మా కన్నపురం సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కొర్లాం పిహెచ్‌సి వైద్యాధికారి సౌజన్య, సిబ్బంది శివ, లక్ష్మణరావు సేవలందించారు.


పరేడ్‌ను పరిశీలిస్తున్న అదనపు ఎస్‌పి తిప్పేస్వామి

పరేడ్ పరిశీలన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎచ్చెర్ల ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో నిర్వహించిన పోలీస్ పరేడ్ కార్యక్రమాన్ని అదనపు ఎస్‌పి జె.తిప్పేస్వామి పరిశీలించారు. ముందుగా పోలీసు సిబ్బంది ఆయనకు గౌరవ వందనాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో సిబ్బందికి శారీరక, మానసిక దృఢత్వం ఉన్నప్పుడే ఉత్సాహంగా ప్రజలకు సేవలు అందించగలమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పిలు వై.శృతి, ప్రసాదరావు, వాసుదేవ్, చొప్ప రాజు, సురేష్, ఉమామహేష్ ఉన్నారు.


మాట్లాడుతున్న పరమేశ్వరరావు

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. శుక్రవారం అక్కుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల కేంద్రంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో అధికారం చేపట్టిన టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ఈ దిశగా కృషి చేయడంలో విఫలమయ్యాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ, నిరుద్యోగుల ఆశలు నెరవేరాలన్నా, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, మహిళా సంక్షేమం కొనసాగాలన్నా కాంగ్రెస్‌తోనే సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార విభాగం నాయకులు తిర్రి శాంతారావు, జిల్లా దళిత విభాగం అధ్యక్షులు తెంబురు మధుసూదనరావు, రుద్రమూర్తి పాల్గొన్నారు .

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

శ్రీకాకుళం అర్బన్: వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల వారికి కేంద్ర ప్రభుత్వం అమలు వస్తున్న పథకాలపై విస్తృతస్థాయిలో అవగాహన కల్పించేందుకు అవకాశం కలిగిందని రాజ్యసభ సభ్యులు జి.వి.ఎల్ నరసింహారావు అన్నారు. నగరంలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో శుక్రవారం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల ప్రజలు అవగహన కలిగి ఉండాలన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధ్యక్షతన జరిగిన వికసిత భారత్ సంకల్ప యాత్ర సదస్సులో సంకల్పయాత్ర కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ చల్ల ఓబులేష్, మెప్మా పిడి కిరణ్ కుమార్, బిజెపి జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరావు, బిజెపి నాయకులు పైడి వేణుగోపాలం, పూడి తిరుపతిరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జి.వి.ఎల్

తెలగలను బిసి జాబితాలో చేర్చాలి

లావేరు: అన్నివిధాలా వెనుకబడిన తెలగ సామాజిక తరగతిని బిసి జాబితాలో చేర్చాలని మండల తెలగ సంఘం నాయకులు శుక్రవారం తహశీల్దార్ సాధు దిలీప్ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు రొక్కం బాలకృష్ణ, యినపకుర్తి తోటయ్యదొరలు మాట్లాడుతూ మండలంలో సుమారు 25 వేల మంది తెలగ కులస్తులున్నారని, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా చాలా వెనుకబడి ఉన్నామని, సన్నకారు రైతులుగా, రైతు కూలీలగా, భవన నిర్మాణ కార్మికులగా కాలం వెల్లడిస్తున్నామన్నారు. పిల్లల చదులో, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. కార్యక్రమంలో తెలగ సంఘం నాయకులు దేశెట్టి తిరుపతిరావు, ఎల్. శ్రీనువాసురావు, నాగం కనకరాజు, ఐ.శ్రీను, మురళీ పాల్గొన్నారు.

పలాస: తెలగ కులస్తులకు బిసి రిజర్వేషన్ కల్పించాలని పలాస కాశీబుగ్గ రాజరాజేశ్వరి దేవి తెలగ కుల సంక్షేమ సంఘం కార్యదర్శి, కోశాధికారి ఎన్.వాసు, టి.అప్పారావు


లావేరు : తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

డిమాండ్ చేశారు. తెలగ కులస్తులను బిసిలో చేర్చాలని పలాస తహశీల్దార్ ఎల్.మధుసూదనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో 8వేలు పైబడి తెలగ కులస్తులు ఉన్నారని, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నామన్నారు. గతంలో పుట్టు స్వామి కమిషన్, మంజునాథ్ కమిషన్లు తెలగ కులస్తులు పేదరికంలో ఉన్నట్లు గుర్తించి అప్పటి ప్రభుత్వానికి రిపోర్టు కుడా ఇవ్వడం జరిగిందన్నారు. వినతిపత్రం అందించిన వారిలో లోకు భాస్కరరావు, ప్రతాప్, రాజు, గిరి, ప్రసాద్, కామేష్ తదితరులున్నారు.

ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- పలాస

నియోజకవర్గం పరిధి పలు గ్రామాల్లో వైసిపి నాయకులు ఫ్లెక్సీలు ధ్వంసం చేశారని, ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష డిమాండ్ చేశారు. మండలం లొద్దభద్ర, కిష్టుపురం, మున్సిపాలిటీలో చినబడాంతతో పాటు వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో టిడిపి ధ్వంసం చేసిన ఫ్లెక్సీలను శుక్రవారం ఆమె పరిశీలించారు. అనంతరం కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపికి చెందిన వ్యక్తులు ఫ్లెక్సీలు ధ్వంసం చేయడం దారుణమన్నారు. వినతిపత్రం అందించిన వారిలో


డిఎస్‌పి నాగేశ్వర్ రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న శిరీష

టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, కృష్ణారావు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం


ఆక్రమణ స్థలం వద్ద గ్రామస్తులతో కలిసి మాట్లాడుతున్న సురేష్‌బాబు

ప్రజాశక్తి- పలాస

మున్సిపాలిటీ పరిధిలో పద్మనాభపురం, అంబుసోలి గ్రామ పరిసరాల్లో 391/6, 246లో శ్మశానవాటిక ఆక్రమణ చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు కోరారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కొత్తకోట జనార్ధనరావు, పిల్లి ఊర్మిళ మధ్య తగాదా స్థలం ఉందని, 53/ 2018 గా నమోదు కాబడి కోర్టులో వాజ్యం నడుస్తోందన్నారు. అయితే కొంతమంది ఆక్రమణదారులు, రౌడీషీటర్లు ఊర్మిళ వద్ద అగ్రిమెంట్ పొందినట్లు పత్రం చూపించి అంబుసోలి గ్రామ శ్మశానమార్గం, బావి ఆక్రమించడం జరిగిందన్నారు. ఈ స్థలంపై మున్సిపాలిటీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం ప్రారంభించారన్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. గ్రామస్తులతో కలిసి ఆక్రమణ చేపడుతున్న స్థలాన్ని పరిశీలించి ఆక్రమణదారులను ప్రశ్నించగా వారు గ్రామస్తులపైకి దూసుకు వచ్చి బెదిరింపులకు పాల్పడ్డారని సురేష్ బాబు తెలిపారు. గ్రామస్తులకు న్యాయం చేసేందుకు శ్మశానవాటిక స్థలం ఆక్రమణకు గురికాకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న రౌడీ షీటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సురేష్ బాబు కోరారు. ఈ విషయంపై ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నామని సురేష్ బాబు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

వజ్రపుకొత్తూరు: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానవన శాఖ ఉప సంచాలకులు సుజాత అన్నారు. శుక్రవారం అమలపాడు సర్పంచ్ దున్న రత్నం బాలరాజు అధ్వర్యంలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా రీ ప్లాంటేషన్, రీ జనరేషన్ పథకంలో లబ్ధి పొందిన రైతుల తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ప్రాంతంలో కొబ్బరి అభివృద్ధికి తనవంతు సహకారం


మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ సుజాత

అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిడి బి.కుమార్, జిల్లా ఉద్యానవన శాఖాధిఆకరి అర్‌వివి ప్రసాద్, సంతోష్ కుమార్, సునీత, సంధ్య, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో కొల్లివలస సమీపంలో శుక్రవారం ఉదయం ఆటో బోల్తా పడింది. గ్రామాల్లో పాలసేకరణ కోసం పాలకొండ పట్టణం నుంచి డెయిరీకి సంబంధించిన ఆటో కొల్లివలస సమీపంలోకి రాగానే బోల్తా పడింది. దీంతో పాలు మొత్తం నేలపాలయ్యాయి. డ్రైవర్‌కు గాయాలవ్వడంతో 108 వాహనం ద్వారా పాలకొండ ఏరియాఆస్పత్రికి తరలించారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలో బొడ్డేపల్లిపేట మామిడి తోటల్లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను ఎస్ఐ వై. కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.11,510 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు తెలిపారు.


రోడ్డు పక్కన జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్న ఎస్ఐ

ఎస్ఐ చొరవతో జంగిల్ క్లియరెన్స్

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో రాజుపేట సమీపంలో అనునిత్యం ప్రమాదాలు సంభవించడంతో పాటు పలువురు ప్రాణాలు కోల్పోతుండడం, ఈ ప్రాంతంలో రోడ్డుకి ఇరువైపులా పెద్దఎత్తున జంగిల్ పెరిగిపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనాలు ఢీ కొట్టి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. శుక్రవారం ఎస్ఐ అశోక్‌బాబు తనసొంత డబ్బులతో ప్రొక్లెయినర్, ట్రాక్టర్లను ఏర్పాటు చేసి జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. రహదారిని బాగు చేయించారు. ప్రమాదాల నివారణ కోసం తన సొంత డబ్బును ఖర్చు చేసి చర్యలు చేపట్టిన ఎస్ఐ అశోక్‌బాబును మండల ప్రజలు అభినందించారు.

ఎనిమిది జట్లు ఎంపిక

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో ఈ నెల 10 నుంచి 18 వరకు జరిగిన ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 8 జట్లు నియోజవర్గస్థాయికి ఎంపికయ్యాయి. బాల్ బ్యాడ్మింటెన్‌లో చాపరకు చెందిన రెండు జట్లు, కబడ్డీలో చాపర, కరజాడ, ఖోఖోలో కేరాశింగి, చాపరజట్లు, క్రికెట్ పోటీలో గొప్పిలి, వాలీబాల్‌లో చాపర జట్టు ఎంపికైనట్లు ఎంపిడిఒ చంద్రకుమారి, ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల మండల ఆర్గనైజర్ గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంఇఒ-1 జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- కవిటి


ఎస్.జోరాడు

మండల విద్యాశాఖ అధికారుల(ఎంఇఒ-1) అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఎంఇఒ-1 అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయ మజ్జి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడిగా ఎస్ జోరాడు(సోంపేట ఎంఇఒ-1), జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎల్ ఈశ్వరరావు(లావేరు ఎంఇఒ-1), జిల్లా ఉపాధ్యక్షుడుగా ఆర్.శ్రీనివాస్ నాయక్ (పోలాకి ఎంఇఒ-1)ను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. రవి నాయక్ తదితరులు నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు.

షర్మిల ప్రమాణ స్వీకారానికి రావాలి


ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా వైయస్ షర్మిల ఈనెల 21న ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ప్రజలందరూ తరలి రావాలని రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు కోరారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బలోపేతం అవుతుందన్నారు. ప్రజలకు తాగు, సాగునీరు అందించి పారిశ్రామిక అభివృద్ధి కార్మిక, కర్షక అభివృద్ధి వంటి గొప్ప కార్యక్రమాలు చేసి ఎపిని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన కాంగ్రెస్ పార్టీ పాలనను నేటికీ ప్రజలు మరిచిపోలేదని అన్నారు. మళ్లీ ప్రజలందరి సహకారంతో వైఎస్ షర్మిల సారధ్యంలో 2024 ఎన్నికల తర్వాత మళ్లీ ఆనాటి స్వర్ణ యుగం కాంగ్రెస్ పార్టీ పాలన రాబోతున్నదని జోష్యం చెప్పారు.


మోహనరావును సన్మానిస్తున్న గ్రామస్తులు

దాతలకు సన్మానం

వజ్రపుకొత్తూరు: ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలను సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం గారుడుభద్రలో చింతల పోలమ్మ కళావేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గౌరీశంకర్ దేవాలయంలో ఇంకుడు కుండీ నిర్మాణానికి ఆర్థికసాయం అందించిన అక్కుపల్లి గ్రామానికి చెందిన జామి మోహనరావును సన్మానించారు. కార్యక్రమంలో గరుడభద్ర గ్రామ సంఘ అధ్యక్షులు వై. ధర్మారావు, సంతోష్ కుమార్, ఎ.దానేసు పాల్గొన్నారు.


ఆర్థికసాయం చేస్తున్న సంఘ సభ్యులు

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

నందిగాం: మండలం కల్లాడకు చెందిన దాసరపు రమణయ్య కుటుంబానికి కాపు తెంబూరుకు చెందిన సరస్వతి సేవా సంఘం సభ్యులు రూ.15 వేలు ఆర్థికసాయాన్ని శుక్రవారం రమణయ్య కుటుంబానికి అందించారు. రమణయ్య దంపతులు ఇంట్లో దీపం వెలిగించి బయటకి వెళ్లారు. కొంత సమయానికి ఇంట్లో నుంచి మంటలు రావడంతో గ్రామస్తులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. రమణయ్య కర్ర పని చేస్తుంటాడు. ఈ ప్రమాదంలో ఇంట్లో నిల్వ చేసిన కలప, సామాగ్రీ బూడిదైంది. రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. కొల్లి హరిబాబు, కారగ్గి ధర్మారావు, గుర్రాల హరికృష్ణ, మోహనరావు, మురళి పాల్గొన్నారు.